క్లుప్తంగా

నేడు పట్టణంలో విద్యుత్ కోత

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణంలోని పంచముఖి కాలనీ ఫీడర్ నిర్వహణ, మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ కోత ఉంటుందని టౌన్ 3 ఏఈ భగవంతయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా టీచర్స్ కాలనీ, పద్మావతి కాలనీ, కృష్ణ గుడి, కాళికాంబగుడి, పంచముఖి కాలనీ, పాలకొండ రోడ్డు, మర్లు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల దాక విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. దీంతో పాటు టీచర్స్ కాలనీ, దుబాయ్‌బంగ్లా, మర్లు యోగి టిఫిన్ సెంటర్, ఎస్‌ఆర్ నగర్, విజయనగర్‌కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల దాక విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఈర్ల నర్సింహ బాటలో పయనిద్దాం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అసమానతలు లేని నవ సమాజం కోసం తన చివరి శ్వాస వరకు ఎర్రజెండా పట్టి ఉద్యమించిన ఈర్ల నర్సింహ బాటలో పయనిద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆపార్టీ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి వర్గ సభ్యుడు ఈర్లనరసింహ ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, బి.రాము, నాయకులు నరేష్, నరసింహ్మా, చాంద్‌పాషా, సత్యనారాయణరెడ్డి, లక్ష్మన్, పవన్‌కుమార్‌రెడ్డి, దావిద్, దశరథ్, గోపాల్, రాములు పాల్గొన్నారు.

బాధ్యులను అరెస్టు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇటీవల బండమీదిపల్లిలో ఓ వైన్స్ షాపు నిర్వాహకులు చేసిన దాడిలో బలీద్‌పల్లికి చెందిన శ్రీకాంత్ యాదవ్ మృతి చెందాడని.. అందుకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని బీసీ సమాజ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రీకాంత్‌యాదవ్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోకుండా కాలయాపన చేయడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. ఘటనపై వెంటనే విచారణ చేపట్టాలని కోరారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

నవాబుపేట: రుద్రారం బీఆర్‌ఎస్ నాయకుడు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి ఆ పార్టీని వీడుతున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఇన్ని రోజులు తన సేవలకు గుర్తింపు ఇచ్చిన పార్టీ నాయకత్వానికి, క్యాడర్‌కు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో మరో పార్టీలో చేరబోతున్నట్లు వివరించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

హన్వాడ: పంచాయతీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సంఘం మండల అధ్యక్షుడు బాలకిష్టయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం గత ఐదు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. వెంటనే చర్యలు తీసుకుని వేతనాలు ఇవ్వాలన్నారు.

ధ్వజస్తంభ ఏర్పాటుకు విరాళం



బాలానగర్: నేరళ్లపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ ఏర్పాటుకు ఎంపీటీసీ సభ్యుడు లింగునాయక్ రూ. 1.50 లక్షల విరాళం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ ఖలీల్, జగత్ ప్రకాష్, యాదయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా బీరప్ప ఉత్సవాలు

మక్తల్: మండలంలోని లింగంపల్లిలో శుక్రవారం ఎల్లమ్మ బండారు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. తొమ్మిదేళ్లకు ఒకసారి నిర్వహించే ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఉత్సవాల్లో దాదాపు 30 వేల మంది భక్తులు పాల్గొని పసుపు బండారు చల్లుకునేందుకు పోటీపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య పాల్గొన్నారు.



ఇంకెప్పుడు ఇస్తారు సారూ?

- అప్పులు చేసి గొర్రెల కోసం డీడీలు కట్టామంటున్న ఆశావహులు
- ఏడాది గడిచినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన



మొదటి విడతలో ఇచ్చిన సబ్సిడీ గొర్రెలు

రాజాపూర్: గొర్రెలు, మేకలను పెంచిపోషించి వాటిపైనే ఆధారపడి జీవించే కురుమ, గొల్ల యాదవులకు గత ప్రభుత్వం సబ్సిడీపై గొర్రెలను ఇచ్చేందుకు ఆశావహులతో డీడీ కట్టించుకున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పటికీ మండల పరిధిలోని చాలామందికి సంబంధిత గొర్రెలు అందలేదు. దీంతో డబ్బులు కట్టిన వారు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి మరీ డబ్బులు కట్టామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారడంతో చివరికి గొర్రెలు ఇవ్వకపోగా.. తాము కట్టిన డీడీల డబ్బులు కూడీ తిరిగి ఇవ్వడం లేదని తిరిగి మాకు ఇవ్వడం లేదని గొల్లకురుమలు ఆవేదన చెందుతున్నారు. మండల పరిధిలో మొదటి విడతలో 90 శాతం సబ్సిడీతో కేసీఆర్ ప్రభుత్వం 12 గ్రామ పంచాయతీలకు చెందిన 349 యూనిట్లను అందించింది. కాగా రెండో విడతలో మండలంలో 12 గ్రామపంచాయతీలకు 150 యూనిట్‌లు మంజూరు అయ్యాయి. దీంతో తమకు గొర్రెలు వస్తాయని ఆశపడి చాలామంది డీడీలు చెల్లించారు. చెల్లించి సంవత్సరకాలం దాటుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆశావహులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

అప్పుచేసి డీడీ కట్టా



సబ్సిడీపై సర్కార్ గొర్రెలు ఇస్తుందంటే తెలిసిన వారి వద్ద వడ్డీకి డబ్బులు తెచ్చి డీడీ కట్టాను. ఏడాది గడిచిపోయినా ఇప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. గొర్రెలూ రాకపాయె.. కనీసం కట్టిన డబ్బులూ వెనక్కి ఇవ్వక పోయిరి. అధికారులను అడిగితే మా చేతుల్లో ఏమి లేదంటున్నారు. ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు.

– జంగిలయ్య యాదవ్, రాయపల్లి

వెంటనే ఇస్తామన్నారు



డీడీలు కట్టిన వెంటనే గొర్రెలు ఇస్తామన్నారు. మొదటి విడతలోనూ కర్ణాటక, రాయలసీమకు తీసుకుపోయి ఇప్పిచ్చిన జీవాలు కూడా ఇక్కడి వచ్చినాక వాతావరణం అనుకూలించక చనిపోయాయి. మంచి గొర్రెలను ఇప్పించలేదు. రెండోవిడత వస్తాయంటే.. అధికారులు చెప్పిన మేరకు డీడీలు కట్టినం. ఇప్పటికీ ఇవ్వడం లేదు.

– దూళ్ల మల్లేష్‌యాదవ్, రాజాపూర్ మండలం

చర్యలు తీసుకుంటాం



రెండో విడతలో డీడీలు చెల్లించిన వారికి ప్రభుత్వం తిరిగి డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నది. ఇప్పటికే మండలంలోని కుచ్చర్‌కల్, కల్లేపల్లి తదితర గ్రామాల్లో డబ్బులు తిరిగి ఇచ్చారు. మిగతా వారికి కూడా డీడీలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

– కార్తీక్, మండల పశువైద్యాధికారి, రాజాపూర్

వీరభద్రుడి ఉత్సవాలకు వేళాయె



వీరభద్ర స్వామి ఆలయం



భద్రకాళి సమేత వీరభద్రుడు

నవాబుపేట: లోకిరేవు వీరభద్రుడి జాతర శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఇక్కడ వాగు ఒడ్డుపై స్వయంభూగా వెలసిన స్వామి భద్రకాళీ సమేతంగా ఇంటిదేవుడిగా స్థానికుల నుంచి పూజలు అందుకుంటున్నాడు. కాగా తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి సైతం ఇక్కడి భక్తులు వస్తుంటారు. కాగా ఉత్సవాలకు సంబంధించి పూజారులు లింగయ్య, నందీశ్వర్ పలు వివరాలు తెలియజేశారు. శనివారం నంది కోళసేవ, 19న తెల్లవారుజామున అగ్నిగుండం, సాయంత్రం శకటోత్సవం, పార్వతీ పరమేశ్వర కల్యాణం ఉంటాయన్నారు. అనంతరం 20న ప్రత్యేక అలంకరణ, 21న మహా మంగళహారతితో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

పాలమూరు యూనివర్సిటీకి బెంచీల వితరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీకి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు 15 బెంచీలను వితరణ చేశారు. ఈమేరకు పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బ్యాంక్ వారు విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బెంచీలను అందించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి, రీజినల్ హెడ్ శ్రీనివాసమూర్తి, చీఫ్ మేనేజర్ ఆర్‌జీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

బాలానగర్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని శుక్రవారం జెడ్పీ సీఈఓ రాఘవేందర్ రావు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను, అమ్మ ఆదర్శ పాఠశాలల పనితీరుపై ఆరా తీశారు. ఎన్‌ఆర్ ఈజీఎస్ కూలీలు చేస్తున్న పనులు, వారి సంఖ్య పెంపుపై వివరాలు సేకరించారు. ఎంపీడీఓ శరత్‌చంద్ర తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ



ఓబ్లాయిపల్లిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న డీఏఓ వెంకటేష్ తదితరులు



అప్పంపల్లిలో విత్తనాలు అందిస్తున్న అధికారులు

చిన్నచింతకుంట/హన్వాడ/మహబూబ్‌నగర్ రూరల్/బాలానగర్ : అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో శుక్రవారం రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తీర్ణ అధికారి శ్రీజ మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలను అందిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీనుగ బస్తాకు రూ. 1,116, జనుము బస్తాకు రూ. 1,448 చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీంతో పాటు రైతు పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌ను తీసుకవచ్చి జీలుగ బస్తాలను తీసుక వెళ్లాలన్నారు. సహకార సంఘం సీఈఓ బషీర్, సిబ్బంది శివ కుమార్, రైతులు శేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బోయ నర్సింహలతో పాటు పలువురు ఉన్నారు.

రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు హన్వాడ వ్యవసాయాధికారి కిరణ్, బాలానగర్ వ్యవసాయ అధికారి ప్రశాంత్ రెడ్డి శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. వినియోగించుకోవాలని సూచించారు. రైతులు సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై సరఫరా చేస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఓబ్లాయిపల్లి శివారులోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో విత్తనాలను పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి ఇష్రత్ సుల్తానా, ఏఈఓ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాగుతున్న ఆరాధన మహోత్సవాలు



పోటీల్లో కీర్తనలు ఆలపిస్తున్న భజన మండలి సభ్యులు



స్వామివారి రథోత్సవంలో అడుగుల భజన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం తెలంగాణ చౌరస్తాలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి, వేంకటేశ్వరస్వామి, శివలింగ ఆంజనేయస్వామివార్లకు అభిషేకం, విశేష పూజలు, హోమం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భజన పోటీలు రెండో రోజు కొనసాగాయి. సాయంత్రం స్వామివారి రథోత్సవం ఊరేగింపు నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా శనివారం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాములవారు, వివిధ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, ధార్మికోపన్యాసములు, భజనలతోపాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ వడ్ల శేఖరాచారి, అధ్యక్షులు ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి వి.నారాయణ తెలిపారు. కార్యక్రమాల్లో కమిటీ కోశాధికారి నారాయణ, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షుడు మణికొండ నర్సింహాచారి, విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షుడు సత్తయ్యాచారి, కార్యదర్శి రమేష్, భీమాచారి, భాగన్నగౌడ్, లక్ష్మీనారాయణ, సుధాకరాచారి, భాస్కరాచారి, రాఘవాచారి రవితదితరులు పాల్గొన్నారు.



పోటీలను తిలకిస్తున్న భక్తులు

కుంటకట్ట తవ్వేస్తున్నారని ఫిర్యాదు



కట్టను తవ్వేస్తున్న జేసీబీ

రాజాపూర్: మల్లేపల్లి శివారులో ఉన్న మోతుకులకుంట చేపల చెరువు వద్ద రాజాపూర్‌నకు చెందిన కొందరు శుక్రవారం జేసీబీ, ట్రాక్టర్‌లతో కట్టకు ఉన్న మట్టిని తవ్వేందుకు చర్యలు చేపట్టారు. దీంతో మల్లేపల్లికి చెందిన మత్స్యకారులు విషయం గమనించి అడ్డుకోబోయారు. కాగా తమ భూమిలో కట్ట ఉందని అందుకే తొలగిస్తున్నామని సదరు వ్యక్తులు మత్స్యకారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో వారు తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన ఆర్‌ఐని అక్కడి పంపి పనులను ఆపివేయించారు. విషయంపై ఇరిగేషన్ అధికారులకు కూడా సమాచారం ఇచ్చినట్లు వివరించారు. కుంటలు, చెరువుల కట్టలను తొలగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న ఏఓ రాజేందర్ అగర్వాల్

దేవరకద్ర: పట్టణంలోని విత్తనాలు, మందులను విక్రయించే పలు షాపులను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్ తనిఖీ చేశారు. త్వరలో వానాకాలం సీజన్ రాబోతుండడంతో రైతులకు విక్రయించే విత్తనాలను, షాపుల్లో ఉండే స్టాక్‌ను పరిశీలించారు. అలాగే కొనుగోలు చేసిన రసీదులను, రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు స్టాక్‌ను సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన వ్యాపారులకు సూచించారు. రైతులకు ఎంఆర్‌పీ ధరలకే విత్తనాలు, మందులను విక్రయించాలని అలాగే కొనుగోలుకు సంబంధించిన రసీదులు ఇవ్వాలని తెలిపారు. నకిలీ విత్తనాలు, నకిలీ మందులు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వ్యవసాయ విస్తీర్ణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాల్వ పూడికతీత పనుల పరిశీలన



సూచనలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 45వ వార్డు పరిధిలోని కొత్తచెరువు కాల్వలో ట్రాక్టర్‌తో చేపట్టిన పూడికతీత పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. కాల్వ చివరి వరకు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు నిల్వ ఉండకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో 47వ వార్డు కౌన్సిలర్ సి.గోవిందు, కాంగ్రెస్ నాయకుడు చిన్న తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సిద్ధంగా ఉంచాలి



నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

మిడ్జిల్: మండల పరిధిలోని వల్లభ్‌రావుపల్లిలోని వన నర్సరీని శుక్రవారం ఎంపీడీఓ గీతాంజలి పరిశీలించారు. వానకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పలు సూచనలు చేశారు. మొక్కలను నాటడానికి సిద్ధంగా ఉంచాలని కార్యదర్శికి సూచించారు. మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పనుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. ఏపీఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉపాధి పనులు



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

దేవరకద్ర: మండల కేంద్రం నుంచి మీనుగోనిపల్లి గ్రామాల మధ్య ఉన్న కోయిల్‌సాగర్ ఎడమ కాల్వలో షీల్టు తీసే పనులు గత వారం రోజులుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం కాల్వలో మట్టిని తీసే పనులు ముమ్మరంగా సాగాయి. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈవో సీత్యా నాయక్‌లు పనులను పర్యవేక్షణ చేశారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పనులు త్వరగా పూర్తి చేయాలని కూలీలకు సూచించారు.

వాసవీమాతకు ఘనంగా పూజలు



దేవరకద్రలో వాసవీమాతకు పూజలు చేస్తున్న భక్తులు



గీతాలాపన చేస్తున్న చంద్రశేఖర్‌రావు



జడ్చర్లలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం పలువురు భక్తులు అమ్మవారికి అభిషేకం చేయించి ప్రత్యేక అలంకారంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో సామూహిక కుంకుమార్చన, అనంతరం అమ్మవారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు.

నేడు వాసవీమాత జయంతి వేడుకలు

దేవరకద్రలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవీమాత జయంతి సందర్భంగా 108 కళాశాలలతో అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తారని దేవస్థాన కమిటీ వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరుగుతుందని, మధ్యాహ్నం మహా మంగళ హారతి అనంతరం ప్రసాదాల పంపిణీ ఉంటుందని తెలిపారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఆవోపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు మహాగణపతిపూజతో ప్రారంభం చేశారు. ధ్వజారోహణం, సర్వతోభద్ర మండప, యోగినిమండప, నవగ్రహ పూజలు చేపట్టారు. గద్వాల చంద్రశేఖర్‌రావు బృందంతో చేపట్టిన భక్తిసంగీత కార్యక్రమం ఆహుతులను ఆకట్టుకుంది. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దాచేపల్లి చంద్రయ్య, ఆవోపా అధ్యక్షుడు ఎలిశెట్టి మురళితోపాటు ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు



అడ్డాకుల: మూసాపేట మండలం వేముల నుంచి దాసర్‌పల్లి గ్రామానికి వెళ్లే దారి పలుచోట్ల ప్రమాదకర మలుపులు తిరిగి ఉంది. వేముల దాటిన తర్వాత చెరువు కట్ట వద్ద ఉన్న మలుపు వద్ద గతంలో అనేక ప్రమాదాలు సంభవించాయి. ఎదురుగా వచ్చే వాహనం దగ్గరికి వచ్చే వరకు కనిపించే పరిస్థితి లేదు. అదేవిధంగా ఇక్కడ వేగనిరోధకాలు ఏర్పాటు చేయలేదు. దీనివల్ల వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో ప్రమాదకర మలుపు వద్ద సూచిక బోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేయాల్సిన అవసరముందని స్థానికులు చెబుతున్నారు.

ఈసారైనా బడిని బాగు చేస్తారా..!



శిథిలావస్థకు చేరిన పాఠశాల



పైకప్పు నుంచి ఊడిపడిన పెచ్చులు

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. పైకప్పు నుంచి పెచ్చులు ఊడి పడుతుండటంతో గతేడాది పాఠశాలను మూసి వేసి వేశారు. ఇక్కడి విద్యార్థులను హైస్కూల్‌కు తరలించి అక్కడే తరగతులను నిర్వహించారు. శిథిలమైన బడిని పూర్తిగా కూల్చేసి కొత్త భవనం నిర్మించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేసినా గత ప్రభుత్వం నిధులను విడుదల చేయలేదు. దీంతో ఈ ఏడాది కూడా విద్యార్థులు అరకొర వసతుల మధ్య హైస్కూల్‌లోనే చదువుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. ఇదిలా ఉంటే పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కింద సుమారు రూ.2.95 లక్షలు మౌళిక వసతుల కల్పన కోసం మంజూరయ్యాయి. వాటితో పాఠశాలను బాగు చేయించే పరిస్థితి లేదు. కొత్త భవన నిర్మాణానికి కావాల్సిన నిధుల కోసం గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఇప్పటికే ఉన్నతాధికారులను కలిశారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పాఠశాలపై దృష్టి సారించి శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చి వేసి దాని స్థానంలో కొత్త భవనం నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.